దిన పత్రిక తొలి సమయం
బుధవారం ,4 -3 -2026

## అడవుల రక్షణే లక్ష్యం ఇల్లందులో వన్యప్రాణి దినోత్సవం



తొలి సమయం, ఇల్లందు;మార్చి, 03

వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఇల్లందు పట్టణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్డిఓ కరుణాకర చారి మాట్లాడుతూ జిల్లాలో ఇల్లందు ప్రాంతం అటవీ విస్తీర్ణం కోల్పోయిన జాబితాలో ఉందని, దీనిని పునరుద్ధరించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అంతరించిపోతున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఆర్ ఓ చలపతిరావు, మిగతాసిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన అమ్మపల్లి శ్రీనివాస్ రెడ్డి



తొలి సమయం, వనపర్తి మార్చ్ 03

కుటుంబ సభ్యులను పరామర్శించి దైర్యం నింపిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. పెద్దమందడి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు అమ్మపల్లి. శ్రీనివాస్ రెడ్డి బ్రెయిన్ స్ట్రోక్ కు గురై హైదరాబాద్ లోని సిటీ న్యూరో సెంటర్ హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి. నిరంజన్ రెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పారు.వైద్యులను శ్రీనివాస్ రెడ్డి ఆరోగ్యం గురించి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గౌరవ నిరంజన్ రెడ్డి వెంట మాజీ జిల్లా రైతు సమితి అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి బి.ఆర్.ఎస్ నాయకులు ఉన్నారు.

## వన దేవతలను అవమానించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### తుడుండెబ్బ అధ్యక్షులు పూనేం సందీప్



తొలి సమయం కొత్తగూడ 03 మార్చి 2026

గిరిజనుల ఆరాధ్య దైవాల సన్నిధిలో చెప్పులతో తిరగడం అత్యంత అవమానకరం. వన దేవతలను అవమానించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలి" అని తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూనేం సందీప్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం శ్రీ సమ్మక్క సారాలమ్మ జాతర పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనకు రాష్ట్ర మంత్రులు దనసరి సీతక్క మరియు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వచ్చిన సందర్భంగా కొంత మంది ప్రభుత్వ అధికారులు అమ్మవారి సన్నిధిలో చెప్పులు ధరించి తిరగడం ఆదివాసీల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆయన అన్నారు. సమ్మక్కసారాలమ్మలను గిరిజనులు అత్యంత పవిత్రంగా కొలుస్తారని, అలాంటి పవిత్ర స్థలంలో ఆచారాలను పాటించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుని గిరిజన సమాజానికి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంలో మంత్రి సీతక్క స్వయంగా జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు.

# పోరాట స్ఫూర్తితో మహిళలు ఐక్యంగా ముందుకు రావాలి

### - కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా సమగ్ర ఉద్యమానికి పిలుపు : ఆగబోయిన నర్సక్క



తొలి సమయం కొత్తగూడ 03 మార్చి 2026



కొత్తగూడ మండలం : అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం పాలడుగు కృష్ణ స్మారక భవనం మరియు కిష్టాపురం గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భం గా ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ ఆగబోయిన నర్సక్క మాట్లాడుతూ, మార్చి 8 మహిళల చరిత్రలో ఒక ప్రేరణాత్మక దినమని అన్నారు. మహిళలు ఓటు హక్కు, సమాన వేతనం, ఎనిమిది గంటల పని దినం వంటి హక్కులను నిరంతర పోరాటాల ద్వారా సాధించుకున్నారని గుర్తుచేశారు. 1910లో కమ్యూనిస్టు నాయకురాలు క్లారా జెట్‌కిన్ ప్రతిపాదనతో ప్రారంభమైన ఈ దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక మహిళల ఐక్యతకు ప్రతీకగా మారిందన్నారు. 1975లో ఐక్యరాజ్యసమితి అధికారిక గుర్తింపు ఇవ్వడంతో ఈ దినం మరింత ప్రాముఖ్యత పొందిందని వివరించారు. ప్రస్తుతం మహిళలు అనేక రంగాల్లో వివక్ష, నిరుద్యోగం, తక్కువ వేతనాలు, అసంఘటిత రంగాల్లో ఉపాధి అసురక్షిత పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, కార్మిక హక్కులను రక్షించాలని, మహిళల ఉపాధి భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను పునఃసమీక్షించాలని, కనీస వేతనాలను ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. మహిళలు మరియు బాలికలపై జరుగుతున్న అక్రమ రవాణా, మద్యం మరియు మాదకద్రవ్యాల వ్యాప్తి, లైంగిక హింస వంటి సమస్యలను అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు, భూమి హక్కు, స్వయం నిర్ణయాధికారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చివరగా, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు మహిళలకు అనుకూలంగా లేవని విమర్శిస్తూ, వాటికి వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా, సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ మండల కార్యదర్శి తోలెం నిర్మలతో పాటు రమ, సంధ్య, లక్ష్మి, సృజన, మల్లమ్మ, బుర్కా సౌజన్య, బంగారి కవిత, కల్తీ జ్యోతి, స్వరూప, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు మానవత్వానికి నిదర్శనం

తొలి సమయం కొత్తగూడ 03 మార్చి 2026



కొత్తగూడ మండలం ఎంచగూడ గ్రామానికి చెందిన గుజ్జ కమలాకర్ ఇటీవల తాడ్వాయిపస్త్ర ప్రధాన జాతీయ రహదారిపై జరిగిన భయానక రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా కోల్పోవడంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ దుర్ఘటనను హృదయానికి హత్తుకున్న కమలాకర్ స్నేహితులు మానవత్వాన్ని చాటుకుంటూ ముందుకు వచ్చారు. సాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 19961997 పదో తరగతి మిత్రబృందం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో అక్షరాలా రూ.55,500లను సేకరించి అందజేశారు. “మిత్రుడు లేడేమో కానీ అతని కుటుంబం ఒంటరిగా లేదు” అనే సందేశాన్ని స్పష్టంగా చాటుతూ వారికి మనోధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో తక్కలపల్లి శ్రీనివాసరావు, వేణుగోపాల్ రెడ్డి, రజిని, ప్రభాకర్, సత్యనారాయణ, రమేష్, మొయినుద్దీన్, ముదురుకోల వెంకన్న, భోజ్యా, సతీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో కేవలం సానుభూతి మాటలకే పరిమితం కాకుండా చేతల్లో సహాయం చేసి నిలిచిన ఈ స్నేహితుల చర్యకు గ్రామస్థులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## మామిడి తోటలో కోడిపందాల గుట్టురట్టు

### గుర్తూరు గ్రామ శివారు మామిడి తోట



తొలి సమయం తొర్రూరు మార్చి 3

తొర్రూరు మండలం గుర్తూరు గ్రామ శివారులో గల మామిడి తోటలో కోడిపందాలనుఈరోజు తేదీ 3 -3 -2026 రోజున మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుర్తూరు గ్రామ శివారులో గల మామిడి తోటలో కోడిపందాలను నిర్వహిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేయగా కోడి పందాలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులతో పాటు 65,400 రూపాయలు ,17 కోళ్లు , 4 సెల్ ఫోన్లు,3 మోటర్ సైకిల్లు మరియు ఒక బొలెరో వాహనం ను సీజ్ చేసి నిర్వాహకుల మీద కేసు నమోదు చేయడం జరిగింది. ఉపేందర్ నిందితుల వివరాలు తెలిపారు1)గుంజ వెంకటేష్ తండ్రి కోటయ్య , వడ్డెర, తార్ సింగ్ భాయ్ తండా వద్ద ఇటుక బట్టి నిర్వాహకుడు 2) అల్లం హుస్సేన్ తండ్రీ పుట్టయ్య, బేడ బుడగ జంగాల, తొర్రూర్ 3) అల్లం ప్రసాద్ తండ్రి కోటయ్య, బేడ బుడగ జంగాల, తొర్రూర్ 4) కిన్నెరసారయ్య తండ్రి మస్తాన్, బేడ బుడగ జంగాల, గ్రామం తొర్రూర్ వీటితోపాటు మరి కొంతమంది పరారీలో ఉన్నారు.

## వన్యప్రాణులే ఊపిరి వాటి సంరక్షణే మన భవిష్యత్ ఎఫ్ఆర్ఓ వజహాత్



తొలి సమయం కొత్తగూడ 03 మార్చి 2026




అడవులు పచ్చగా ఉంటేనే జీవజాలం సురక్షితం వన్యప్రాణులు బ్రతికితేనే ప్రకృతి సమతుల్యం నిలుస్తుంది అని కొత్తగూడ రేంజ్ అటవీ శాఖ అధికారి వజహత్ హితవు పలికారు. జాతీయ వన్య ప్రాణుల దినోత్సవం పురస్కరించుకొని రేంజ్ పరిధిలోని కార్లాయి, బత్తులపెల్లి సెక్షన్ అధికారుల ఆధ్వర్యంలో పోలారం కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఘనంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో చైతన్యం రగిలించేలా వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చిన్నారులు వన్యప్రాణుల ప్రాధాన్యతను తమ ఆలోచనలతో, చిత్రాలతో అద్భుతంగా ప్రతిబింబించారు. అడవులు, వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ఆధారం అని, వాటి సంరక్షణ ప్రతి పౌరుడి నైతిక బాధ్యత అని అధికారులు స్పష్టం చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అటవీ శాఖ తరఫున బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయగా, విద్యార్థుల ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంది. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చైతన్య, సెక్షన్ ఆఫీసర్ పద్మారావు, బీట్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అటవీ సంపద రక్షణ కోసం ఇలాంటి చైతన్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.